క్లుప్తంగా

బీసీలను జాగృతం చేద్దాం



జడ్చర్ల టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని, అందుకే గ్రామాల్లో బీసీలను జాగృతం చేసి ఎన్నిలకు సన్నద్ధం చేద్దామని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల వనరుల కేంద్రం వద్ద బీసీ జాగృతి సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా బొల్లెమోని నిరంజన్, మండల అధ్యక్షుడిగా గొడుగు నర్సింహులు, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కురువపల్లి గోపాల్‌ను నియమించి, వారికి నియామకపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శివరాములు, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లింగంపేట శేఖర్, నాయకులు రాములు, గోపల్, ఎమ్మార్పీఎస్ నాయకులు భీంరాజ్, శివశంకర్‌లు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొంటాం



గండీడ్: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సల్కర్‌పేట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని సుమారు 15 డివిజన్ల పరిధిలో స్థానిక ఎన్టీయార్ డిగ్రీ మహిళా కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు సుమారు రెండు నెలల పాటు తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సీఈఈ, సంపూర్ణ ఎర్త్ సొల్యూషన్ సంస్థల ఆధ్వర్యంలో చేపట్టారు. తాజాగా గురువారం వీరికి మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, కెమిస్ట్రీ హెచ్‌ఓడీ ప్రవీణ్‌కుమార్, 'సంపూర్ణ' డైరెక్టర్ డెబరత్ బెనర్జీ, ఆర్కిటెక్చర్ ఝురా, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు మదన్, అనిల్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్ పాల్గొన్నారు.

ముగ్గురికి రిమాండ్

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన కేసులో కోర్టు ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ రాంమ్‌లాల్ నాయక్ తెలిపారు. ఈ నెల 4న చిన్నచింతకుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కుర్వరమేష్, శివ, ఉప్పరి వెంకటేష్‌లు పాఠశాలలోకి చేరి పాఠశాల సిబ్బందితో ఎలాంటి అనుమతి తీసుకోకుండా పాఠశాల గంటను కొట్టి విద్యార్థులను రోడ్డుపైకి తీసుకెళ్లారు. విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ విషయంపై పాఠశాల జీహెచ్‌ఎం మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గురువారం థర్డ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ మహబూబ్‌నగర్ ముందు ప్రవేశ పెట్టారు. కోర్టు ముగ్గురు వ్యక్తులకు 14 రోజులు జుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపాడు.

మోమోస్ స్టాల్ ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో గురువారం సాయంత్రం మోమోస్ స్టాల్ (హంగర్ రోల్స్)ను ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జి డీఎంసీ లక్ష్మి, సీఓలు వరలక్ష్మి, నిర్మల, దేవమ్మ, ఆంజనేయులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహా రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుగొమ్మలు



వేపూర్‌లో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుగొమ్మలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీ డీకే అరుణతో కలిసి మండలంలోని టంకర, వేపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఆయా గ్రామాల్లో రూ.44–50 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ గ్రామానికి రోడ్లు, రవాణా కమ్యూనికేషన్, ఆరోగ్య సదుపాయాలు, విద్యాసంస్థలు, విద్యుత్ ఏర్పాటు వంటివి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తాయన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన చాలా ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎంపీ డీకే అరుణ వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు మహేందర్, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

రైతు సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగినోనిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల నుంచి సేకరించిన వడ్లను బియ్యంగా మార్చి రేషన్ షాపుల్లో తిరిగి ప్రజలకే పంపిణీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు టంకర కృష్ణయ్యయాదవ్, నర్సింహులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం: ఎంపీ

మిడ్జిల్: దేశంలో మారుమూల గ్రామాల అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమవుతుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. మిడ్జిల్ మండలంలోని మర్లబావి తండాలో సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, పద్మజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్షులు నరేష్‌నాయక్, రవీందర్‌గౌడ్, బుచ్చయ్య, వెంకటయ్య, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కల్వరి గుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ వచ్చే భక్తులకు ఇన్నాళ్లు రోడ్డు మార్గం సరిగ్గా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి శామ్యుల్, కల్వరి ఎంబీ చర్చి చైర్మన్, పాస్టర్ ఎస్.వరప్రసాద్, జేకబ్, డేవిడ్, టైటస్ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల నాయకుడు హన్మంతు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మాచన్‌పల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గితే ఏ దేశంలోనైనా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయని, కానీ భారతదేశంలో భిన్నంగా ధరలను పెంచుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు లింగంగౌడ్, ఎస్.నర్సింహులు, ఖాదర్, ఈశ్వరమ్మ, లక్ష్మి, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొలతలతో దుస్తులు కుట్టాలి



దేవరకద్ర: విద్యార్థుల కొలతల ఆధారంగా దుస్తులు కుట్టాలని జిల్లా సీఎంఓ బాలుయాదవ్ సూచించారు. గురువారం దేవరకద్ర మండల సమాఖ్యకు కొత్త యూనిఫామ్‌ల కోసం క్లాత్ రావడంతో జిల్లా అధికారులు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా టైలర్లు దుస్తులు కుట్టడం కోసం కటింగ్‌లు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి కొలత తీసుకుని సౌకర్యంగా దుస్తులు కుట్టాలని ఆయన కోరారు. జూన్‌లో పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫామ్‌లు సిద్ధం కావాలని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రతి పాఠశాలకు పూర్తి స్థాయిలో యూనిఫామ్‌లను పంపిణీ చే యాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

ఓంకారానంద ఆరాధన

జడ్చర్ల టౌన్: మండలంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో ఆచార్య కృష్ణానందస్వామి ఆధ్వర్యంలో గురువారం దివంగత ఓంకారానంద స్వామి మండల ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్భగవద్గీత పారాయణం, సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీకిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపకులు ఉమ్మెంతల మహేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

12న వీరహనుమాన్ విజయయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గణేష్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న సాయంత్రం 4 గంటలకు రాంమందిర్ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే వీరహనుమాన్ విజయయాత్ర గడియారం చౌరస్తా, బాలగంగాధర్ తిలక్ (అశోక్‌టాకీస్) చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, న్యూటౌన్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు ఉంటుందన్నారు. ఈ విజయయాత్రలో గణేష్ మండపాల సభ్యులు, దేవాలయ కమిటీలు, భజన బృందాలు, యువజన సంఘాలు, హైందవశక్తి సేవా సంస్థలు, హిందూ వాహిణి సభ్యులు తదితర ధార్మిక సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



పర్దీపురంలో వరిధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతుల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలంలోని పర్దీపురం, లాల్‌కోట, పల్లమరి, కొకుంట్ల మండలం అప్పంపల్లిలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పెద్ద వడ్డేమాన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు కల్గిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య, చిన్నచింతకుంట, కొకుంట్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అప్పంపల్లి, ముచ్చింతల సింగిల్ విండో చైర్మన్లు సురేందర్‌రెడ్డి, ఉమమహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దతండా, కప్పెట, రావులపల్లి, పోతులమడుగు గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు, సన్న బియ్యం పంపిణీ ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ మురళీధర్ పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్నాం

అడ్డాకుల: ప్రజా ప్రభుత్వంలో పేదలను ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌరిదేవిపల్లి, రాంచంద్రాపూర్, రాచాలలో ఆయన పర్యటించారు.

మాచన్‌పల్లిలో పోషణ్ అభియాన్ వారోత్సవాలు



పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ సరితారాణి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/గండీడ్/నవాబ్‌పేట: మండలంలోని మాచన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ అభియాన్ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పలు పోషక పదార్థాలు, పాలు, గుడ్లు పండ్ల ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరితారాణి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, శశికళ, మూవేంద్ర, ఆశలు పాల్గొన్నారు.

- గండీడ్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ దేవన్న హాజరై ప్రసంగించారు.
- నవాబ్‌పేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాములు, బాలమ్మ, శ్రీనివాస్, విజయ, శరభలింగం, రాఘవేందర్, శారద, కవిత ఉన్నారు.

మాంసం మార్కెట్‌కు ప్రీ-కాస్ట్ కాంపౌండ్ వాల్



మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగిన మాంసం వ్యాపారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 42వ డివిజన్ పరిధిలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న మాంసం మార్కెట్‌కు గురువారం సాయంత్రం ప్రీ–కాస్ట్ కాంపౌండ్ వాల్ ఏర్పాట్లు చేశారు. అయితే వీటి వల్ల తమ వ్యాపారం దెబ్బతింటుందని, ఖాళీగానే వదిలేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్‌లతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. చివరకు మాజీ కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి అక్కడికి వచ్చి మాంసం వ్యాపారులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఒకప్పుడు దీని చుట్టూ పక్కా కాంపౌండ్ వాల్ ఉండేదని, కాలక్రమేణా పడిపోగా.. ఆ ప్రాంతం నాలుగు రోడ్ల కూడలి కావడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు తాజాగా ఈ చర్యలకు ఉపక్రమించారని వివరించారు. అందుకు మాంసం వ్యాపారులు సైతం అంగీకరించారు. వాస్తవానికి ఇక్కడ మొత్తం ఎనిమిది దుకాణా (షెట్టర్లు)లతో పాటు కొంత ఖాళీ స్థలం ఉంది. వీటిని కొన్నేళ్ల క్రితం మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే నిర్మించారు. వీటికి కనీసపు అద్దెగాని, ట్రేడ్ లైసెన్స్ ఫీజు గాని చెల్లించకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది.

విగ్రహాల తొలగింపు.. తేలని వివాదం



ప్రతిష్ఠపై స్పష్టత ఇచ్చాకే విగ్రహం వద్ద పనులు చేయాలంటున్న ప్రజాసంఘాల నాయకులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 167వ నంబరు జాతీయ రహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద ఉన్న విగ్రహాల తొలగింపు ప్రతిష్ఠపై స్పష్టత కొరవడటంతో విగ్రహాలు ఉండగానే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో గురువారం ప్రజాసంఘాలు కాంట్రాక్టర్, అధికారుల శైలి పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలె జయంతి ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా ఆయనను అవమానించేలా వ్యవహరించటం తగదని మండిపడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డ రైల్వే బ్రిడ్జి ఇరువైపులా ప్రముఖుల విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనేక ఏళ్లుగా ఆయా సర్కిల్‌ను నెహ్రూ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాగా, కొన్నేళ్లుగా పూలె అంబేడ్కర్ చౌరస్తాలుగా పిలుస్తున్నారు. అలాంటి సర్కిల్‌కు నేడు ఇబ్బందులు కలుగుతున్నాయి. 167వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విగ్రహాల తొలగింపు అనివార్యమైంది. తొలగించిన విగ్రహాలు ఎక్కడ ప్రతిష్ఠించాలనే విషయంలో స్పష్టత కొరవడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పండుగలా బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాలు

- త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో కేసీఆర్ సభ
- పోస్టర్ ఆవిష్కరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డా.లక్ష్మారెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 24ఏళ్లు పూర్తయి 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రజతోత్సవ సంబరాలను పండుగలా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డా.సీ. లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ కేంద్రంలో ఈనెల 27న జరిగే పార్టీ రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం నియోజకవర్గ కేంద్రంలోని ఆయన గృహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 14ఏళ్లు పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్ల పాటు అభివృద్ధి పథంలో కేసీఆర్ సీఎంగా ముందుకు తీసుకెళ్లారన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని దేశంలోని మిగితా రాష్ట్రాలను అధిగమించి నంబర్‌వన్‌గా నిలిపారన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుంచి 3 వేల మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇదే క్రమంలో త్వరలోనే మహబూబ్‌నగర్ జిల్లాలో కేసీఆర్ బహిరంగసభ సైతం ఉంటుందన్నారు. అంతకుముందు ఆయన 'చలో వరంగల్' వాల్‌రైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కె.యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు ప్రణీల్‌చందర్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, ఇమ్ములతో పాటు మరికొందరు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి సన్మానం

కేసీఆర్ ముందుచూపుతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించిన ఐదు మెడికల్ కళాశాలల వల్ల పేదింటి బిడ్డలు వైద్య విద్యను అభ్యసించగలుగుతున్నారని లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. మండలంలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన నందిని నాగర్‌కర్నూలు జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి ఏడాది చదువుతున్నందున శాలువాతో ఆమెను సత్కరించి అభినందించారు. నందిని లాంటి ఎంతోమంది పేదలు వైద్య విద్యను అభ్యసించటం కేసీఆర్ చలవేనన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేద్దాం

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ, రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల నివాసంలో నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. వరంగల్ సభకు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి విజయవంతం చేద్దామని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం ఆవిర్భావ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని 11కేవీ తెలంగాణ చౌరస్తా ఫీడర్ పరిధిలో చెట్ల కొట్టివేత కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టూ టౌన్ ఏఈ ఆదిత్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఎర్ర సత్యం చౌరస్తా, అష్టలక్ష్మి అపార్ట్‌మెంట్, క్రిస్టియన్‌కాలనీ, సుభాష్‌నగర్, బోయపల్లి గేట్, పోలీస్‌లైన్, కలెక్టర్ బంగ్లా చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

14 నుంచి షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం గణేష్‌నగర్‌లోగల శ్రీషిరిడీసాయిబాబా దేవాలయంలో ఈనెల 14 నుంచి 16 వరకు 17వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజు శనివారం స్వామివారి అభిషేకంతో వార్షికోత్సవ పూజలు ప్రారంభమవుతాయి. 15న ఉదయం సుప్రభాత సేవ, కాగడహారతి, విష్ణ్వేశ్వర పూజ, దీపారాధన, మండపారాధన నిర్వహిస్తారు. 16న ఉదయం సుప్రభాత సేవ, కాగడహారతి, 21 కలశాలతో స్వామివారికి అభిషేకం, సాయంత్రం స్వామివారి పల్లకీసేవ నిర్వహించనున్నారు. బాబావారి వార్షికోత్సవ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్త కోరారు.

జడ్చర్లలో మోస్తరు వర్షం

జడ్చర్ల టౌన్: గురువారం సాయంత్రం జడ్చర్లలో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి పద్మావతి కాలనీలో మురికికాలువలు పొంగి రోడ్లపై నీరు పారింది. మున్సిపాలిటీ ప్రధాన రహదారి సిగ్నల్‌గడ్డ– నేతాజీ చౌరస్తా రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం కొంత చల్లబడింది.

ఎస్సీ కుల ధ్రువపత్రాల జారీలో జాప్యం

మహబూబ్‌నగర్ రూరల్: మదాసి కురువ, మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాల జారీ విషయంలో రెవెన్యూ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆ సంఘం నాయకులు వెంకటేష్, బాలరాజు, మల్లేష్, డాక్టర్ వెంకటేష్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మదాసి కురువలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని, మెనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందని గుర్తుచేశారు. సమావేశంలో విఠల్, శ్రీను, యాదయ్య, సత్యం పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత

నవాబుపేట: వృద్ధులకు, వితంతువులకు చేయూతనిచ్చేందుకు నిరంతరం ముందుంటామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తన సొంత ఖర్చులతో 213 మందికి వృద్ధులకు నెలవారి పింఛన్లు అందించారు.

పోషకాహారంతో టీబీ దూరం



గండీడ్: మండం కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో టీబీ రోగులకు పోషకాహార వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, పల్లీలు, నూనె వస్తువులను 40 మంది టీబీ రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, శిల్ప, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, యాదమ్మ, పుష్పవేణి, దుర్గా మల్లేశ్వరి, మమత, మంజుల పాల్గొన్నారు.

రేపటి నుంచి రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ గ్రామ సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. శనివారం ఆలయంలో ధ్వజారోహణం, స్వామి వారి రథోత్సవం, 13న రాత్రి వివిధ భక్త బృందాల చేత భజన కార్యక్రమాలు, నందికోళ్ల సేవ, 14న అగ్నిగుండం, స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి డోలారోహణం నిర్వహిస్తారు. 15న గణపతి రుద్రహోమం, పార్వతి పరమేశ్వర్ల కల్యాణం, విగ్రహ ఊరేగింపు, 16న ధ్వజరోహణ మహోత్సవం ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి వీరేశం తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

14న భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ సాహితి మహబూబ్‌నగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో 14న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ పరిరక్షణ అంశంపై సదస్సు, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా మైనొద్దీన్, కొప్పోలు యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, సాహిత్య అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

'పీర్ల పండుగను గుర్తించాలి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీర్ల పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించాలని పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం కన్వీనర్ జి.గట్టన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్టీయూ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో విశిష్టత ఉందన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, అప్పట్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ సాంస్కృతిక సాధనంగా ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో టీఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డీ.ఖలీల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పి.విజయకుమార్, పీర్ల పండుగ నిర్వాహకులు గోపాల్‌గౌడ్, సహేను, ముజీబ్, షబ్బీర్ పాల్గొన్నారు.